ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : **బి.వి.ఎల్.ఎన్.రాజు**

**సంపుటి : 16** **సంచిక : 06** **ఫిబ్రవరి 2011**

**రమణ భాస్కర**
**ఆధ్యాత్మిక మాస పత్రిక**
**పేజీలు : 24**

గౌరవ సంపాదకులు
శ్రీమతి **P.H.V.**
**సత్యవతి (హైమ)**

**చందా**
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

**చిరునామా**
**రమణ భాస్కర**
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
**సద్గురు శ్రీ నాన్నగారు**
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు ~ 534 265
☎ 08814 - 224747
9247104551

**ఈ సంచికలో....**
అరుణాచలం... 21-11-2010
జిన్నూరు ......... 23-12-2010
జిన్నూరు ......... 11-12-2010

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్
పాలకొల్లు. 9848716747

## నా రమణ ప్రస్థానం

**(జనవరి 2011 శ్రీరమణజ్యోతిలో డాక్టర్ మిథిన్, హైద్రాబాద్ వారి ఆంగ్ల వ్యాసమునకు తెలుగు అనువాదం)**

నేను మంగుళూరులో కాలేజీలో చదువుకొనే రోజులలో, శ్రీరామకృష్ణపరమహంసగారి భక్తునిగా శ్రీరామకృష్ణ మఠమును తరచుగా సందర్శించుట జరిగేది. 1995-96 సంవత్సరములో శ్రీరామకృష్ణులు కౌపీన ధారియై సోఫాలో కూర్చున్న విధముగా దర్శనమిచ్చారు. 'స్వామీ' ఎందుకు కేవలము కౌపీనము మాత్రమే ధరించియున్నారు? అని నేను ప్రశ్నించగా చిరునవ్వే వారి సమాధానం.

అది 2000 సంవత్సరము. బెంగుళూరు శ్రీరమణకేంద్ర వ్యవస్థాపకులు శ్రీ నటరాజన్ గారు రచించిన 'కాలంలో కాలాతీతుడు' అనే పుస్తకం ద్వారా భగవాన్ శ్రీ రమణ మహర్షికి పరిచయం కాబడ్డాను. ఆవిధంగా భగవాన్ శ్రీరమణుల తత్త్వబోధకు ఎంతగానో ఆకర్షింపబడిన నేను తదుపరి అన్వేషణలో గతంలో కౌపీనధారియై శ్రీరామకృష్ణులు దర్శనం ఇచ్చిన మాదిరిగానే భగవాన్ శ్రీ రమణమహర్షి ఫొటో కనుగొనుట జరిగింది. కాలం గడిచేకొలది అరుణాచలం పట్ల నా భక్తిభావం పెరుగుతూ ఉంది, కాని ప్రత్యక్షంగా వెళ్ళి అరుణాచలం దర్శించే అవకాశం రాలేదు.

అది 2008 సంవత్సరము ఇంటర్‌నెట్‌లో శ్రీరామకృష్ణుల వివరములు సేకరిస్తుండగా, భగవాన్ శ్రీరమణులు ప్రియశిష్యులైన సద్గురు శ్రీ నాన్నగారి గురించి తెలియవచ్చింది. ఎప్పటికైనా

శ్రీనాన్నగారిని దర్శించగలనా? అనే తపన, కోరిక కలిగినవి. తదుపరి శ్రీనాన్నగారు హైదరాబాద్‌లోని శ్రీసత్యసాయి నిగమ్‌లో అనుగ్రహభాషణం చేయుటకు వస్తున్నారని విని నేను కూడా అక్కడకు వెళ్ళి వారి ప్రవచనం వినాలని నిశ్చయించుకొన్నాను. ఆరోజు మధ్యాహ్నం 2 గంటలకు శ్రీ సత్యసాయి నిగమ్ చేరుకొని, చివరి వరుసలోని సీటులో కూర్చొన్నాను. అప్పటికి భక్తులందరి మధ్య రసవత్తరమైన సంభాషణ నడుస్తోంది. సద్గురు రాకతో అక్కడ నిశ్శబ్దత నెలకొంది.

అనుచర భక్తులతో సభాస్థలి వద్దకు శ్రీనాన్నగారు వచ్చి ప్రవచనం మొదలుపెట్టారు. వారు ప్రవచించిన అద్వైతబోధను అంతకు పూర్వము నేను వినియుండలేదు. కేవల పుస్తక జ్ఞానంకాక, సత్యానుభవం నుండి వారి బోధ జాలువారినదని నిశ్చయమైనది. నేను ఒక సద్గురువు సమక్షంలో ఉన్నానని అప్పుడే అనుకొన్నాను. సూర్యాస్థమయం కావస్తోంది, ప్రవచనము ముగింపుకు వస్తోంది, అప్పుడు శ్రీనాన్నగారు కూర్చొన్న వెనుక భాగం పై అంతస్థ కిటికీ ద్వారా సూర్యకిరణములను ఏకాగ్రంగా దర్శించుట జరిగింది. ఆ క్షణంలో నేను అలౌకిక శాంతికి గురియైనాను, తరువాత నిశ్శబ్దత అలముకుంది. ప్రవచనం పూర్తి అయిన తరువాత శ్రీనాన్నగారు అక్కడ గుమికూడిన భక్తజన సమూహమును తన కరుణాపూరితమైన, మృదువైన చూపుద్వారా అనుగ్రహిస్తున్నారు. మొత్తం ఆ ప్రాంగణంలో నిశ్శబ్దత నెలకొంది. ఆ మౌనం వారి మాటల కన్న ఎక్కువ శక్తివంతమైనది. అక్కడ ఉన్న భక్తుల ప్రతి ఒక్కరి రెండు నేత్రములు శ్రీ నాన్నగారినే కేంద్రీకరించి స్థిరంగా చూస్తున్నాయి. అప్పుడు నా శ్వాస ఆగి ఒక మౌనశక్తి నన్ను ఆక్రమించినట్లు అనుభూతి చెందాను. శ్రీనాన్నగారు ఖచ్చితంగా మహాపురుషుడే అని నిశ్చయించుకొన్నాను.

పిమ్మట నా రాకను నాన్నగారు గుర్తించారా? లేదా? అన్న విషయాన్ని రూఢి చేసుకొనేందుకు మనోతరంగాలను పంపించాను. నాన్నగారి చుట్టూ అనేక మంది భక్తులు చేరి మాట్లాడుటకు, నమస్కరించుటకు, ఆశీస్సులు పొందుటకు ఎదురు చూస్తున్నారు. సభాస్థలికి ఎదురుగా నిలబడిన నేను నాన్నగారు పలుకరిస్తారేమోనని ఎదురు చూస్తున్నాను, కాని శ్రీ నాన్నగారు నావైపు చూడలేదు నా రాకను గమనించనూ లేదు. నేను మీ గురించి వచ్చాను అని మానసికంగా అనుకొన్నాను, కాని శ్రీ నాన్నగారు నన్ను తప్ప అందరిని చూసారు. అప్పుడు నా అహంకారం కొద్దిగా దెబ్బతిని మా ఇద్దరి మధ్య జన్మాంతర అనుబంధం లేదేమో అనుకొని, ఇక ఆ ప్రదేశం విడిచిపెట్టి వెళ్ళుటకు సిద్ధపడ్డాను.

ఆ సభాప్రాగంణం నుండి బయటకు వస్తుండగా ఒక ఆలోచన వచ్చింది, శ్రీ నాన్నగారు నిజంగా మహాపురుషుడే! నా అహంకారాన్ని, అసహనాన్ని ప్రక్కనపెట్టి మరొకసారి ప్రయత్నిద్దామనుకున్నాను. నూతనోత్సాహంతో మరల లోపలికి ప్రవేశించి శ్రీనాన్నగారు ఉన్న చోటుకి చేరుకున్నాను. అప్పటికీ అక్కడ అనేకమంది భక్తులు గుమికూడి ఉన్నప్పటికీ ఆయన అనుగ్రహం వల్ల అక్కడ కొంత ఖాళీ ఏర్పడి, సద్గురువు శ్రీనాన్నగారు చిరునవ్వు మోముతో నన్ను చూచుట జరిగినది. ఆయన నన్ను సమీపించి నాకుడి బుగ్గను తన చేతితో తాకినారు, ఆశ్చర్యంతో నేను ఆయనకు వంగి నమస్కరించాను. కుడిబుగ్గమీద ఆయన తాకిన స్పర్శ ఆ రోజంతా దివ్యానుభూతిలో ఓలలాడించింది.

శ్రీ నాన్నగారి అనుగ్రహ ప్రభావమో లేదా పురాకృత పుణ్య ఫలితమో, నెల తిరగకుండా పవిత్ర అరుణాచల క్షేత్రంలో కాలు పెట్టుట జరిగింది. ఆ రోజు ఉదయం గిరి ప్రదక్షిణ చేస్తుండగా, అరుణగిరి శిఖరం మేఘావృతమై మబ్బుతో కప్పబడి ఉంది. నేను గిరికి హృదయ పూర్వకంగా నమస్కరించాను. అప్పడు ఆ మేఘములు తొలగి ఆడిఅన్నామలై వద్ద నుండి అరుణగిరి ఆకృతిని, శిఖరాన్ని స్పష్టముగా దర్శించి ముగ్ధుడనయ్యాను. గిరి ప్రదక్షిణ ముగించుకొని, శ్రీరమణాశ్రమము చేరి, భగవాన్ సమాధికి ప్రదక్షిణ చేసి, తరువాత తిరిగి హైదరాబాదు చేరుకున్నాను.

పదిహేను సంవత్సరాల క్రితము కౌపీన ధారియైన శ్రీరామకృష్ణ పరమహంస పసిపిల్లవాని మాదిరి బోసినవ్వులతో దర్శనం ఇచ్చారు. తదుపరి కాలంలో అలాంటి నవ్వు, నేను ఇక ఎవ్వరిలోనూ చూచియుండలేదు. కానీ సద్గురు శ్రీ నాన్నగారితో పరిచయం అయ్యాక అదే చిరునవ్వు శ్రీ నాన్నగారిలో దర్శించాను. శ్రీ రామకృష్ణ పరమహంస గారు కౌపీన ధారియై ఇచ్చిన దర్శనమును భగవాన్ శ్రీ రమణ మహర్షిలోనూ, అదేవిధంగా శ్రీ రామకృష్ణుల బోసినవ్వును సద్గురు శ్రీ నాన్నగారిలోనూ దర్శించి ఆశ్చర్యచకితుడనయ్యాను. శ్రీ రామకృష్ణ పరమహంస గారిద్వారా భగవాన్ శ్రీ రమణ మహర్షి, అట్లే భగవాన్ శ్రీ రమణ మహర్షి ద్వారా సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహములోను పడుట ఎన్నో జన్మల పుణ్యఫలితముగా నేను భావిస్తున్నాను.

**అనువాదం : చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్, అమలాపురం**